క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



గుడివాడరూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతామని గుడివాడరూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు పేర్కొన్నారు. గుడివాడ రూరల్ సీఐగా శనివారం రాత్రి ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి దాకా ఇక్కడ సీఐగా పని చేసిన కె.ఏసుబాబు మచిలీపట్నం ఆర్‌పేట సీఐగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన సీఐ సోమేశ్వరరావు మాట్లాడుతూ గుడివాడరూరల్ సర్కిల్ పరిధిలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో జూదాలు, కోడి పందేల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జోరుగా వరి నాట్లు



పామర్రు: మండలంలో వరి నాట్ల పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటం, కాలువల ద్వారా సాగుకు పుష్కలంగా నీరు రావడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండల పరిధిలో 23,500 ఎకరాల్లో వరి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు సుమారు 22 వేల ఎకరాల్లో పనులు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. వరిలో సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ గోపుర శిఖర పునఃప్రతిష్ట

పమిడిముక్కల: కపిలేశ్వరపురం లంకతోటలోని శ్రీ గంగా బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ పాప వినాసేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో గోపుర శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. బలిపీఠ, కాలభైరవ, చండీశ్వర, రాహుకేతువుల పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త మండవ సాయివరప్రసాద్ దంపతులు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

నేటి నుంచి మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజ

పమిడిముక్కల: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మాధవీలత తెలిపారు. మంగళవారం కుంకుమార్చన, లక్ష్మీ అష్టోత్తర శతనామపారాయణ, 16వ తేదీన వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు, 19న శ్రవణా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, 27న కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి ఉత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పార్వతీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన



పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి శ్రావణమాసం ఆదివారం పురస్కరించుకుని భక్తులు సామూహిక లక్ష కుంకుమార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. పామర్రు బ్రాహ్మణ మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుహాసినీల సాయంతో లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించారు. తొలుత సోమేశ్వర స్వామి, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలను జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక కుంకుమ పూజలను చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గడియారం కామేశ్వరీ, కనకదుర్గ, పద్మలత, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు చక్ర శంకువు సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారికి మచిలీపట్నానికి చెందిన ఆర్.జానకీ రమణ దంపతులు వెండి చక్ర శంకువు(అభిరేఖ ధారా పాత్ర)ను సమర్పించారు. ఈ బహూకరణను ఆదివారం ఆలయ సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్‌కు అందించారు. ఈ వెండి శంకువు విలువ రూ.45వేలు ఉంటుందని తెలిపారు. ఆ దంపతుల పేరిట అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

రంగుల ఆహారం..
అనారోగ్యానికి ఆహ్వానం

కలర్‌ఫుల్‌గా కనిపించేవన్నీ రుచికరంగా ఉంటాయని అనుకున్నామో పప్పులో కాలేసినట్లే.. బిర్యానీ తినందే రోజు గడవని ఆహారప్రియులు పట్టణంలో కొంతమంది ఉన్నారు. అయితే కృత్రిమ రంగులు పులిమి.. చూడగానే నోరూరించే చికెన్ పకోడీ, చికెన్ కబాబ్, చికెన్ లెగ్‌పీస్‌లు తిన్నామంటే అనారోగ్యానికి ఆహ్వానం పలకక తప్పదు. జిహ్వ చాపల్యం ఉన్న వారు జాగ్రత్తలు పాటించి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఆస్పత్రి పాలవ్వాల్సిందే..

- నిల్వ ఉన్న మాంసానికి రంగులు
- మోసపోతున్న వినియోగదారులు



రంగు కలిపిన చికెన్ వింగ్స్



రంగులు పూసి తయారు చేసిన చికెన్ కబాబ్

గుడివాడ టౌన్: ప్రజల జిహ్వ చాపల్యాన్ని పసిగట్టిన పట్టణంలోని వ్యాపారులు వారి ఆరోగ్యంతోనే చెలగాటం ఆడుతున్నారు. పట్టణంలో రోడ్ల పక్కన, తోపుడు బళ్లపైన, పెద్ద హోటళ్లలో సైతం కృత్రిమ రంగుల ఆకర్షణకు ప్రజలు లోనవుతున్నారు. ఆహార పదార్థాలకు రంగులు పూయడం కారణంగా మనిషి అనారోగ్యం పాలవుతాడని తెలిసినప్పటికీ వాటివైపే పరుగులు తీయడం ప్రజల అవగాహనా రాహిత్యానికి అద్దంపడుతోంది. హోటళ్లలో మాంసం, ఆహార పదార్థాలకు రంగులు, పౌడర్ కోటింగ్ వేయడం వలన లోపలున్న మాంసం స్థితిగతులు వినియోగదారుడు గుర్తించలేకపోతున్నాడు. ఇదే ఆసరాగా తీసుకుని వ్యాపారులు రెచ్చిపోతున్నారు. నాణ్యతా ప్రమాణాలు లేని ఆహార పదార్థాలు, దీర్ఘకాలికంగా నిల్వ ఉన్న మాంసానికి రంగులు పులిమి విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇదే అంశంపై ఇటీవల పేరొందిన హోటళ్లలో సైతం నిల్వ ఉండి కంపు కొడుతున్న మాంసానికి సైతం రంగులు పూసి విక్రయించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ప్రత్యేకించి ఒకే హోటల్ అని కాకుండా ఇంచుమించు అన్ని హోటళ్లలో భారీగా మటన్, చికెన్, రొయ్యలు నిల్వ ఉంచి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఇవి ప్రజలకు ఎంతో హాని కలిగిస్తాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి రంగు కలపని, నిల్వ ఉండని ఆహార పదార్థాలను గమనించి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రంగు చూసి మోసపోవద్దు



ఇటీవల ఓ ప్రముఖ హోటల్లో జొమాటో ద్వారా ఫ్రైడ్ వింగ్స్ ఆర్డర్ చేశాం. వాటికి రంగులు పులిమి ఉండటంతో గమనించలేకపోయాం. తీరా రుచి చూస్తే వాసన వస్తోంది. హోటల్ యాజమాన్యాన్ని అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. ప్రజలు ఈ విధమైన విషయాలపై శ్రద్ధ చూపాలి. ఆకర్షణీయంగా ఉందని వేడి వేడిగా తినేస్తే రోగాలు తప్పవు.

– ఎండీ అలీబేగ్, గుడివాడ

కఠిన చర్యలు తీసుకుంటాం



రోడ్లపైన, ఇతర హోటళ్లలో మాంసం, ఇతర ఆహార పదార్థాల్లో కలిపే రంగులు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. వీటిలో కలిపే కొన్ని రసాయన పదార్థాల వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలు రంగురంగుల ఆహారాలకు ఆకర్షితులు కావద్దు. నిల్వ ఉన్న పదార్థాలు విక్రయించినా, వినియోగదారులను ఆకర్షించేందుకు అనుమతులు లేని రంగులు కలిపినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– గోపాలకృష్ణ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్

కృష్ణానదిలో పెరిగిన వరద ఉద్ధృతి

తోట్లవల్లూరు: కృష్ణానదిలో ఆదివారం వరద ఉద్ధృతి పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటిని విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి అధికారులు దిగువకు విడుదల చేస్తున్న విషయం విదితమే. బ్యారేజీ నుంచి మూడు లక్షలా ఎనిమిది వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయటంతో నదిలో మళ్లీ క్రమంగా వరద ఉద్ధృతి పెరుగుతోంది. ప్రస్తుతానికి పంటపొలాలకు ఇబ్బంది లేనప్పటికీ వరద తీవ్రత మరింత పెరిగితే పల్లపు ప్రాంతాలు, సొసైటీ భూముల్లో సాగవుతున్న పంటలు వరద ముంపున బారినపడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాములలంకతోపాటు లంక గ్రామాల ప్రజలు, లంకలకు వెళ్లే రైతులు, కూలీలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.



తోట్లవల్లూరు నుంచి పడవలో రాకపోకలు సాగిస్తున్న పాములలంక వాసులు

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళులు

గుడివాడ టౌన్: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య సంస్మరణ సభ ఆదివారం జరిగింది. స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా భట్టాచార్య పశ్చిమ బెంగాల్ ప్రజలకు ఎనలేని సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యెషయ్య, ఎల్.సురేంద్ర, శ్రీనివాస్, కొండ, గోపాల్, వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చురుగ్గా రేషన్ పంపిణీ

పామర్రు: మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ జీ రవికాంత్ పేర్కొన్నారు. మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు 17,558 మంది ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 12,290 మందికి రేషన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇచ్చిన గడువు ఈ నెల 17వ తేదీ లోపుగా పంపిణీని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న వాహన ఆపరేటర్లు

ఎస్సీ కాలనీలో చుట్టుముట్టిన మురుగు నీరు



ఉనికిలి ఎస్సీ కాలనీలోకి చేరిన మురుగు నీరు

మండవల్లి: మండలంలోని ఉనికిలి ఎస్సీ కాలనీలో మురుగు నీరు చుట్టుముట్టి కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలో వరిసాగు భూమి లేదు. అన్నీ చేపల చెరువులే. పంట కాలువల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో చేపల చెరువులన్నీ నీటితో నిండి ఉన్నాయి. దీంతో చెరువుల యజమానులు లెవెలింగ్ (పైపు) తూముల నుంచి నీటిని వదలడంతో మురుగు నీరు గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి ప్రవేశించింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికే కొన్ని గృహాల్లోకి మురుగు నీరు ప్రవేశించిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు పూర్తిగా వర్షం నీటితో నిండిపోయాయి. ఈ సమస్యపై కార్యదర్శి రాధికను ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తోట్లవల్లూరు: ఇసుక అక్రమరవాణకు పాల్పడుతున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తోట్లవల్లూరు ఎస్ఐ ఎం.అర్జునరాజు ఆదివారం తెలిపారు. కుమ్మమూరు, భద్రిరాజుపాలెం గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణకు పాల్పడుతున్న పాతూరి దినేష్, వేమూరి రఘుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



భద్రిరాజుపాలెంలో ట్రాక్టర్‌ను పట్టుకున్న ఎస్ఐ అర్జునరాజు

కొండలమ్మకు మొక్కుల సమర్పణ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలోని క్యూలో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గంగానమ్మ జాతర

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణమాసం తొలి ఆదివారాన్ని పురస్కరించుకుని గంగానమ్మ అమ్మవారి జాతరను ఘనంగా ప్రారంభించారు. గ్రామాల్లో సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారిని ప్రార్థించారు. మండవల్లిలో అచ్యుత శివ ఆధ్వర్యంలో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో భక్తులు గంగానమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులు తొలుత అమ్మవారికి చల్ది నైవేద్యం పెట్టారు.

శ్రీ దుర్గాదేవికి భక్త నీరాజనం

గుడ్లవల్లేరు: కూరాడ లాకుదిగువన శ్రీ కనక దుర్గాదేవి అమ్మవారి వార్షికోత్సవ సంబరాలు ఆదివారం కనులపండువగా నిర్వహించారు. విచిత్ర దేవతా వేషధారణలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపును కొనసాగించారు. స్థానిక యువ కళాకారుల నవగ్రహాల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు రోడ్ల వెంబడి భక్తులు బారులు తీరారు. అమ్మవారి ప్రభను కనక డప్పుల వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు.

ఉచిత వైద్య సేవలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వందలాది మంది రోగులకు గుడివాడ వైద్యురాలు డాక్టర్ గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని కుమ్మమూరులో జరిగింది. గ్రామంలోని ఓ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ అర్జునరాజు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకోవటంతోపాటు రూ.12,500ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీఓ ప్రకారమే సర్దుబాటు

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వం 2020లో జారీ చేసిన జీఓ 53 ప్రకారమే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మార్గదర్శకాల్లో లోపాలను సవరించి సర్దుబాటు ప్రక్రియ ప్రారంభించాలని పేర్కొన్నారు. పాఠశాలలో సీనియారిటీకి బదులుగా కేడర్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

కూచిపూడి(మొవ్వ): విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనంలో పేర్లను తొలగించిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ అభిమానులు డిమాండ్ చేశారు. మొవ్వ మండలం కూచిపూడి–పెదపూడి ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్షలతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు అవమానం కలిగించేలా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు. అంబేడ్కర్ స్మృతి వనానికి ప్రభుత్వం వెంటనే పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ అభిమానులు పాగోలు రమేష్ బాబు, కొప్పుల రాజేంద్ర, బండి సహదేవుడు, కూరపాటి బాలకృష్ణ, లంకపల్లి సుబ్రమణ్యం, దాసరి శ్రీనివాస్, మాతంగి గోపి తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పిస్తున్న అభిమానులు

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని ప్రసిద్ధి చెందిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాల పొంగళ్ల శాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం భక్తులు పోటీ పడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు.

గుర్రపుడెక్కతో పేరుకుపోయిన పామర్రు డ్రెయిన్

పామర్రు: పామర్రులో మురుగు నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన డ్రెయిన్ గుర్రపుడెక్కతో పూడిపోయింది. దీంతో గ్రామంలోని మురుగు నీరు దిగువకు ప్రవహించక ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని వీరాంజనేయపురం, చౌదరి పేట, కోటిరెడ్డి పేట, అరండాల్‌పేటలలోని వర్షపు నీరు, మురుగు నీరు పామర్రు డ్రెయిన్ ద్వారా ప్రవహించి కాలువలో కలవాలి. ఈ విధంగా ప్రవహించితేనే ఆయా ప్రాంతాల్లోని మురుగునీరు దిగువకు ప్రవహించి ఆ ప్రాంతం మురుగు రహిత ప్రాంతంగా ఉంటుంది. అయితే పామర్రు మురుగు డ్రెయిన్‌లో గత కొంత కాలంలో గుర్రపుడెక్క, తూడు కాడలు, చెత్తతో పేరుకుపోయింది. ఈ విషయమై ప్రజా స్పందన కార్యక్రమంలో అర్జీని సమర్పించినా ఏ విధమైన చర్యలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్‌లోని పూడికను తీయించి మురుగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గుర్రపుడెక్క, తూడుకాడలతో పేరుకుపోయిన పామర్రు డ్రెయిన్

రహదారులు ఇలా.. ప్రయాణించేదెలా?



కపిలేశ్వరపురం వద్ద అధ్వానంగా మారిన రహదారి



శ్రీరంగపురం వద్ద కుంగిన రహదారి



గుంతలమయంగా మారిన పమిడిముక్కల-అగినపర్రు రోడ్డు

పమిడిముక్కల: మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. వీరంకిలాకు నుంచి అగినపర్రు మీదగా కూచిపూడి వెళ్లు రోడ్డు, వీరంకిలాకు–ఫత్తేలంక, కృష్ణాపురం–కూచిపూడి, కృష్ణాపురం–ఐలూరు, కృష్ణాపురం–లంకపల్లి, కూడేరు–ఐనపూరు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరడంతో రహదారి కనబడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శ్రీరంగపురం మలుపులో రోడ్డంతా కుంగిపోయి ఉంది. కపిలేశ్వరపురం గ్రామం మధ్యలో రహదారి అగాధంలా మారింది. పూర్తిగా దెబ్బతిన ఈ రహదారులపై నుంచి బస్సులు నడపడం కష్టంగా ఉందని ఆర్టీసీ డ్రైవర్లు చెబుతున్నారు. మండలంలోని 15 గ్రామాల ప్రజలు ఈ ఆరు రహదారులపై నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రౌడీషీటర్లకు సత్ప్రవర్తనపై అవగాహన

గుడివాడరూరల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. గుడివాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఎటువంటి గొడవలు, ఘర్షణలు తలెత్తకుండా ముందుగానే రౌడీషీట్లు ఉన్న వారికి సత్ప్రవర్తనపై అవగాహన కల్పించారు. జరిగిన విషయాలను మర్చిపోయి ప్రవర్తన తీరు మార్చుకుని జీవనం సాగించాలని సూచించారు. ప్రతిఒక్కరూ పోలీసుల హెచ్చరికలు, నియమాలు పాటించాలని పేర్కొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చంటిబాబు